www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

సోమవారం, 03-08-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :93 Issue : 93 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో

## యువతకు ప్రధాని మోదీ సందేశం



5



## చిరంజీవి, నాగార్జునతో మల్టీస్టారర్..

8

## డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- 'నశా ముక్త్ యువ' జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం

6





6

## జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?



6

## బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం

# ఘనంగా లష్కర్ బోనాలు..

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని వ్యాఖ్య



## ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్

- తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు

2



## బోనాల వేడుకల్లో సందడి

- మంత్రి పొన్నం నివాసంలో సీఎం రేవంత్‌తో కలిసి హాజరైన ప్రముఖులు
- ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా సంప్రదాయబద్ధంగా వేడుకలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చిన పొన్నం
- తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక బోనాల విందు

2



- బోనాల మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రులతో కలిసి పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించిన ముఖ్యమంత్రి
- రాష్ట్ర ప్రజల సుఖశాంతి, సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారికి ప్రార్థనలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. ఆలయ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత

2





## కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

జీపీఆర్ పరీక్షల్లో భూగర్భ అసాధారణతల గుర్తింపు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం

217 వెంట్ల పరిశీలనలో పలు చోట్ల కేవిటీస్, సీపేజీ మార్గాల గుర్తింపు

నిర్మాణ లోపాలపై తుది నిర్ధారణ కాదన్న పరిశోధనా సంస్థ

మరిన్ని ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచన

హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

తెలంగాణలో రాజకీయంగా చర్చనీయాంశమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరో కీలక సాంకేతిక అంశం వెలుగులోకి వచ్చింది. ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దిగువన భూగర్భ పరిస్థితులను అంచనా వేసేందుకు నిర్వహించిన గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) పరీక్షల్లో పలు ప్రాంతాల్లో అసాధారణ పరిస్థితులు గుర్తించినట్లు సమాచారం. ఈ పరిశీలనల ఆధారంగా పుణెలోని కేంద్ర జల,

మిగతా 3వ పేజీలో..



## పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు

3



3

## ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్

రూ.10 కోట్లతో నిర్మాణానికి కృషి చేస్తానన్న మంత్రి జూపల్లి

అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో ప్రవాసులతో సమావేశం

తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపు

## రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

- ముందుగానే ₹1.09 లక్షల కోట్ల పన్నుల వాటా విడుదల
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆర్థిక వెసులుబాటు
- అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు ₹19,208 కోట్లు, బీహార్‌కు ₹10,845 కోట్లు
- ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు
- సాధారణ షెడ్యూల్‌కు ముందే నిధులు విడుదల చేసిన కేంద్రం

3





3

## 6,307 మంది చిన్నారులకు విముక్తి



## హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

- ఏవీ రంగనాథ్ కొనసాగింపునకు కాలనీ సంఘాల డిమాండ్
- అమీర్‌పేట, మధురానగర్ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు
- చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపును ప్రశంసించిన ప్రజలు
- హైడ్రాపై దుష్ప్రచారాన్ని ఖండించిన సంక్షేమ సంఘాలు

3

## మత్తు రహిత భారతానికి యువతే బలం

'10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర్నర్

గచ్చిబౌలిలో యువత, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన శివ ప్రతాప్ శుక్లా

మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు



3







# ఉజ్జయిని మహంకాళిని దర్శించుకున్న కేటీఆర్

- తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారికి ప్రత్యేక ప్రార్థనలు
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- బోనాలు తెలంగాణ సంస్కృతి, ఐక్యతకు ప్రతీక అని వ్యాఖ్య
- బీఆర్ఎస్ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి
- రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని మొక్కులు

హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి లష్కర్ బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న కేటీఆర్, బోనాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా ప్రజలందరూ కలిసికట్టుగా జరుపుకునే ఈ వేడుక తెలంగాణ సమాజ ఐక్యతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

సమైక్య రాష్ట్రంలో బోనాలకు తగిన గుర్తింపు లభించలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని కేసీఆర్ తరచూ చెప్పేవారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, పండుగలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో తెలంగాణ కళకళలాడాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖశాంతి కోసం ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నానని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్న లష్కర్ బోనాలు తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబిస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు.

## బోనాల వేడుకల్లో సందడి

హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బోనాల విందుకు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులకు తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. కార్యక్రమానికి వచ్చిన ప్రముఖులను స్వయంగా పలకరిస్తూ ఆతిథ్యం అందించారు. విందు అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధువులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలిచింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఈ ఆత్మీయ సమావేశం బోనాల సంబరాలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

## బోనాల వేడుకల్లో అమెరికా కాన్సుల్ జనరల్ సందడి

హైదరాబాద్, ఆగస్టు 2:

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ. విలియమ్స్ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం లారా ఈ. విలియమ్స్ సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఉజ్జయిని మహంకాళి ఆలయ చారిత్రక విశిష్టతతో పాటు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను అమెరికా కాన్సుల్ జనరల్‌కు వివరించారు. తెలంగాణ ప్రజల భక్తి, విశ్వాసాలు, సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే లష్కర్ బోనాల ఉత్సవాల ప్రత్యేకత, బోనం సమర్పణ అనంతరం జరిగే సంప్రదాయ 'రంగం' కార్యక్రమం ప్రాముఖ్యతను కూడా ఆమెకు వివరించారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశంగా బోనాల ఉత్సవాలు నిలుస్తున్నాయని, అమెరికా కాన్సుల్ జనరల్ పాల్గొనడం రెండు ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. బోనాల ఉత్సవాల్లో ప్రత్యక్షంగా పాల్గొని తెలంగాణ సంప్రదాయాలను దగ్గరగా అనుభవించడం ఆనందంగా ఉందని లారా ఈ. విలియమ్స్ పేర్కొన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ నడుమ బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి.

## ఇండోనేషియాలో ఫెర్రీలో భారీ అగ్నిప్రమాదం

- మదురా ద్వీపం సమీపంలో విషాదం.. ఐదుగురు మృతి, 41 మంది గల్లంతు

ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్:

ఇండోనేషియాలోని మదురా ద్వీపం సమీపంలో సముద్రంలో ప్రయాణిస్తున్న ఓ ఫెర్రీలో భారీ అగ్నిప్రమాదం సంభవించి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, 41 మంది ప్రయాణికులు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో ఫెర్రీలో మొత్తం 271 మంది ప్రయాణికులు ఉన్నారు. అగ్నిప్రమాదం చెలరేగడంతో ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. పలువురు ప్రాణాలు కాపాడుకునేందుకు సముద్రంలోకి దూకినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఘటన సమాచారం అందుకున్న నౌకాదళం, కోస్ట్ గార్డ్, సహాయక బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. పలువురిని సురక్షితంగా రక్షించగా, గల్లంతైన వారి కోసం సముద్రంలో విస్తృత గాలింపు కొనసాగుతోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై ఇండోనేషియా ప్రభుత్వం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేసింది. పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.







# ఉజ్జయిని మహంకాళికి బంగారు బోనం

హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి అర్చకులు, ఆలయ అధికారులు వేదమంత్రోచ్చారణల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సీఎం, తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

లష్కర్ బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, సంప్రదాయ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగగా, బోనాల సంబరాలు నగరమంతా ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కతో పాటు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఆలయ పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొంటూ, రాష్ట్ర ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.





# బోనాల భద్రతకు ఏఐ కవచం

- ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్
- కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న నగర పోలీస్ కమిషనర్
- 2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు
- తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, ముఖ గుర్తింపు వ్యవస్థ వినియోగం
- భక్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ భాగ్యనగరంలో బోనాల పండుగకు విశిష్ట చారిత్రక ప్రాధాన్యం ఉందన్నారు. గోల్కొండ, బల్కంపేట బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగుతున్నాయని తెలిపారు.

ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తుల భద్రత కోసం తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారిత జనసమ్మర్థ నిర్వహణ, నిఘా వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు.



ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలకు ముఖ గుర్తింపు సాంకేతికతను అనుసంధానించినట్లు సీపీ వివరించారు. దీని ద్వారా పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను వేగంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను నిరంతరం పర్యవేక్షిస్తూ, క్యూలైన్లలో రద్దీ పెరిగిన వెంటనే నియంత్రణ చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. తొక్కిసలాటలు వంటి ఘటనలు జరగకుండా అన్ని శాఖలతో సమన్వయంగా పని చేస్తున్నామని సజ్జనర్ తెలిపారు. దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల సహకారంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొంటూ, భక్తులు పోలీసు శాఖకు సహకరించి క్రమశిక్షణతో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి, ట్రాఫిక్ డీసీపీ అవినాశ్ కుమార్, అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





# పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ

- ప్రపంచ స్థాయి ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- 'భారత్ ఫ్యూచర్ సిటీ', 'తెలంగాణ రైజింగ్-2047'తో అభివృద్ధికి కొత్త దిశ
- విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులు
- రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావాలని పిలుపు

**హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా నిర్వహించిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసీ) ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను ఎన్ఆర్ఐలు, విదేశీ ప్రతినిధులకు వివరించారు. తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, వచ్చే ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ఈ దిశగా 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అనుబంధంగా ముచ్చర్లలో కాలుష్య రహిత నెట్ జీరో ప్రమాణాలతో 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రాన్ని కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రి ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్య, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో విస్తృత సంస్కరణలు చేపట్టామని భట్టి తెలిపారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. టాటా గ్రూప్ సహకారంతో రూ.2,100 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక డిజిటల్ శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేశామని భట్టి పేర్కొన్నారు. మూసీ నదిని శుద్ధి చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేసే మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందులను ఎదుర్కొందని ఆరోపించిన భట్టి, ప్రజా ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో పరిస్థితిని మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ప్రతి నెల తొలి తేదీన ఉద్యోగుల వేతనాలు జమ చేస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతో సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రెండో దశ విస్తరణ, అంతర్జాతీయ పెట్టుబడుల రాకతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమైందని భట్టి తెలిపారు. తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని పేర్కొంటూ, అమెరికాలోని తెలుగు ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మత్తు రహిత భారతానికి యువతే బలం

**హైదరాబాద్, ఆగస్టు 2:**

మత్తు రహిత భారతదేశమే వికసిత్ భారత్‌కు బలమైన పునాదిగా నిలుస్తుందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో ఆదివారం నిర్వహించిన '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత, విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'లో భాగంగా తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గవర్నర్ తెలిపారు. మాదకద్రవ్య రహిత భారత నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత యువతే దేశానికి అతిపెద్ద శక్తి అని పేర్కొన్న గవర్నర్, మాదకద్రవ్యాల బారిన పడకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, యోగా, ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజాన్ని నిర్మించగలమని అన్నారు.

ఈ సందర్భంగా '10 కోట్ల మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ' ప్రచార పోస్టర్‌ను గవర్నర్ ఆవిష్కరించారు. తెలంగాణ వ్యాప్తంగా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వం మాత్రమే కాకుండా విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి వర్గం కలిసి పనిచేయాలని గవర్నర్ అన్నారు. యువతను మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.




# ప్రవాసుల కోసం హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్



**బాల్టిమోర్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్:**

అమెరికా నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాస భారతీయులకు అన్ని సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా హైదరాబాద్‌లో ఎన్ఆర్ఐ భవన్ నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ భవన్ ప్రవాస భారతీయులకు సమన్వయ కేంద్రంగా ఉపయోగపడుతుందని అన్నారు. అమెరికాలోని బాల్టిమోర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న 19వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణతో ప్రవాసుల అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యువత వ్యసనాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, మాదకద్రవ్యాలు, ఇతర సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు త్వరలో ప్రభాత భేరి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ సామాజిక ఉద్యమంలో ప్రవాస భారతీయులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**పర్యాటక అభివృద్ధిలో ఎన్ఆర్ఐల భాగస్వామ్యం**

తెలంగాణలో పర్యాటక రంగానికి అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు, వారసత్వ సంపదను అమెరికన్ తెలుగు అసోసియేషన్ బృందాలు, ప్రవాస భారతీయ సంఘాలు దత్తత తీసుకుని అభివృద్ధి, పరిరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికాలోని తమ మిత్రులు, సహచరులకు తెలంగాణ పర్యాటక వైభవాన్ని పరిచయం చేయాలని సూచించారు. తాము పుట్టి పెరిగిన గ్రామాల అభివృద్ధికి ప్రవాసులు అందిస్తున్న సహకారం అభినందనీయమని జూపల్లి అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో ఎన్ఆర్ఐలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. విద్య, వైద్యం కోసం ప్రజలు తమ స్థాయికి మించి ప్రైవేటు సంస్థలపై ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వ రంగంలో విద్య, వైద్య సదుపాయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని మంత్రి తెలిపారు.

**ఎన్ఆర్ఐ కమిటీతో ముఖాముఖి**

అమెరికన్ తెలుగు అసోసియేషన్ మహాసభల సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్ఆర్ఐ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విదేశాల్లో నివసిస్తున్న తెలుగు ప్రవాసుల సమస్యలు, సంక్షేమం, తెలంగాణతో వారి అనుబంధాన్ని పెంచే అంశాలపై చర్చించారు. విదేశాల్లోని తెలుగు సంఘాలతో సమన్వయం, తెలంగాణలో పెట్టుబడులు, పర్యాటక అభివృద్ధి, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవాసులతో ప్రభుత్వ అనుసంధానం వంటి అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. ప్రవాస తెలుగువారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జూపల్లి తెలిపారు. ఎన్ఆర్ఐలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.

# జోగినిలు కన్నీరు పెడితే తెలంగాణకు అరిష్టం

- బోనాల ఏర్పాట్లపై జోగిని శ్యామల ఆగ్రహం
- తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ప్రభుత్వంపై విమర్శలు
- ఐదు పాస్‌లకే పరిమితం చేశారని ఆరోపణ
- జోగినిలకు ఆలయ బోర్డుల్లో అవకాశం ఇవ్వాలని డిమాండ్

**సికింద్రాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్**



బోనాల ఉత్సవాల్లో జోగినిలకు సరైన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జోగిని శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము కన్నీరు పెడితే తెలంగాణ రాష్ట్రానికి మంచిది కాదని, అరిష్టం జరుగుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా ఆదివారం ఆలయానికి వచ్చిన ఆమె ప్రభుత్వ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయని, తమలో ఊపిరి ఉన్నంత వరకు అమ్మవారి సేవకే అంకితం అవుతామని జోగిని శ్యామల అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సాధారణ భక్తులతో పాటు జోగినిలకు కొంత ప్రాధాన్యం లభించేదని, ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాష్ట్రంలో వేలాది మంది శివశక్తులు ఉన్నప్పటికీ తమకు కేవలం ఐదు పాస్‌లు మాత్రమే ఇస్తామని చెప్పారని ఆమె పేర్కొన్నారు. ఆ ఐదుగురిలో ప్రముఖులకు భద్రత కల్పించాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఆలయానికి వచ్చే సమయంలో భక్తుల రద్దీ మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని తెలిపారు.

బోనాల నిర్వహణకు ముందు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశానికి తాము హాజరై సహకరించామని, కానీ ఆ తర్వాత భద్రత, పాస్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని జోగిని శ్యామల అన్నారు. జోగినిల్లో చదువుకున్న వారు ఉన్నారని, ఆలయ పాలక మండళ్లలో తమకు ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

బోనాల పండుగను కేవలం రాజకీయ నాయకులు, పోలీసులు మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఉందని ఆమె వ్యాఖ్యానించారు. మహంకాళి అమ్మవారి అసలు బోనాల వైభవం జోగినిలు బోనం ఎత్తినప్పుడే సంపూర్ణమవుతుందని అన్నారు. తమ సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# హైడ్రాకు ప్రజా మద్దతు వెల్లువ

**హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్**

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ, ప్రభుత్వ నిర్ణయానికి సంఘీభావంగా నగరంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేసిన ప్రజలు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు మద్దతు ప్రకటించారు. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్, వెంగల్‌రావునగర్ ప్రాంతాలకు చెందిన పలు కాలనీ సంక్షేమ సంఘాలు ర్యాలీల్లో పాల్గొన్నాయి. హైడ్రా చర్యలను వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ ప్రభుత్వానికి మద్దతు తెలిపాయి. హైడ్రా ఏర్పాటైన తర్వాత గత రెండేళ్లలో చేపట్టిన చర్యలు నగర ప్రయోజనాలకు ఉపయోగపడుతున్నాయని సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. సుమారు 3,325 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి కాపాడటంతో పాటు, రూ.1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు తెలిపారు. రెండు విడతల్లో 20 చెరువుల పునరుద్ధరణ చేపట్టి వరద ముప్పును తగ్గించే చర్యలు తీసుకుందని ప్రశంసించారు. అమీర్‌పేట, పరిసర ప్రాంతాల్లో గతంలో స్వల్ప వర్షాలకే నీరు నిలిచిపోయేదని, హైడ్రా రంగంలోకి దిగిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చిందని స్థానికులు తెలిపారు. జీహెచ్ఎంసీ, జలమండలి, నీటిపారుదల శాఖల సమన్వయంతో వరద సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఆక్రమణదారులు, వారికి అండగా నిలిచే కొందరు వ్యక్తులే హైడ్రాపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని కాలనీ సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. నగర ప్రయోజనాల దృష్ట్యా హైడ్రా కొనసాగాల్సిందేనని, ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే చర్యలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కొనసాగించాలా లేదా అన్న అంశంపై ఇటీవల చర్చలు జరుగుతున్న నేపథ్యంలో కాలనీ సంఘాల ర్యాలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 6,307 మంది చిన్నారులకు విముక్తి

**హైదరాబాద్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో 124 ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించి 6,307 మంది బాల కార్మికులు, వీధి బాలలను రక్షించాయి. ఈ ఆపరేషన్‌లో సుమారు 620 మంది పోలీసు సిబ్బంది పాల్గొని హోటళ్లు, దాబాలు, నిర్మాణ ప్రదేశాలు, ఇటుక బట్టీలు, వర్క్‌షాప్‌లు, వ్యాపార సంస్థల్లో రాత్రింబవళ్లు తనిఖీలు చేపట్టారు. రక్షించబడిన చిన్నారుల్లో 5,892 మంది బాలురు, 415 మంది బాలికలు ఉన్నారు. వీరిలో 3,447 మంది తెలంగాణకు చెందినవారు కాగా, 2,860 మంది ఇతర రాష్ట్రాలు, నేపాల్‌కు చెందినవారిగా గుర్తించారు.

**బాల కార్మికులపై ఉక్కుపాదం**

రక్షించిన చిన్నారుల్లో 5,041 మంది బాల కార్మికులుగా పనిచేస్తుండగా, 647 మంది వీధి బాలలుగా, మరో 43 మంది భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుల్లో బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టిన పోలీసులు మొత్తం 1,705 కేసులు నమోదు చేసి, 1,710 మందిని అరెస్టు చేశారు. కార్మిక శాఖ అధికారులు 1,381 తనిఖీ నివేదికలు జారీ చేయడంతో పాటు కనీస వేతనాల చట్టం కింద నిందితులకు రూ.37.95 లక్షల జరిమానా విధించారు.

**కుటుంబాలకు అప్పగింత.. అనాథలకు సంరక్షణ**

రక్షించిన చిన్నారుల్లో 5,737 మందిని అధికారులు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. కుటుంబ ఆధారం లేని లేదా అనాథలైన 570 మంది చిన్నారులను చైల్డ్ కేర్ సంస్థలకు తరలించి సంరక్షణ, పునరావాసం కల్పించారు. చిన్నారుల హక్కులను పరిరక్షిస్తూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తెలంగాణ పోలీసులు చేపట్టిన ఈ చర్యలను పలువురు అభినందిస్తున్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల కింద సాంకేతిక లోపాలు?

మొదటిపేజీ తరువాయి

విద్యుత్తు పరిశోధనా సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్) తెలంగాణ నీటిపారుదల శాఖకు సమగ్ర నివేదిక సమర్పించింది. జీపీఆర్ పరీక్షల ద్వారా బ్యారేజీల కింద సుమారు 30 మీటర్ల లోతు వరకు భూగర్భ నిర్మాణం, సీపేజీ మార్గాలు, రాతి పొరల పరిస్థితిని పరిశీలించారు. మొత్తం 225 వెంట్లలో 217 వెంట్ల వద్ద క్షేత్రస్థాయి అధ్యయనం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాలు (కేవిటీస్), భారీ బండరాళ్లు, దెబ్బతిన్న రాతి పొరలు, పూడిక పేరుకుపోవడం వంటి అంశాలు నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

మేడిగడ్డ బ్యారేజీలోని 7వ బ్లాక్‌కు చెందిన 17 నుంచి 21 వరకు వెంట్లు, 8వ బ్లాక్‌లోని 7వ వెంట్, 5వ బ్లాక్‌లోని 35వ వెంట్ వద్ద తీవ్ర స్థాయి అసాధారణతలు గుర్తించినట్లు వెల్లడైంది. అన్నారం బ్యారేజీలో 5వ బ్లాక్‌లోని 47వ వెంట్, సుందిళ్ల బ్యారేజీలో 25, 31, 53వ వెంట్ల పరిసరాల్లో కూడా భూగర్భ పరిస్థితుల్లో మార్పులు గుర్తించినట్లు నివేదిక పేర్కొంది. మూడు బ్యారేజీల్లో కలిపి కేవలం 11 వెంట్ల కింద మాత్రమే ఎలాంటి అసాధారణ పరిస్థితులు కనిపించలేదని, మిగతా ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో భూగర్భ మార్పులు ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైనట్లు సమాచారం. మేడిగడ్డ వద్ద వేగవంతమైన నీటి ప్రవాహం కారణంగా ఇసుక కొట్టుకుపోయి రాఫ్ట్ దిగువన ఖాళీలు ఏర్పడిన అవకాశాన్ని కూడా పరిశీలకులు ప్రస్తావించారు.

అయితే జీపీఆర్ పరీక్షలు భూగర్భ పరిస్థితులను అంచనా వేయడానికి మాత్రమే ఉపయోగపడతాయని, నిర్మాణ లోపాలను నేరుగా నిర్ధారించవని సీడబ్ల్యూపీఆర్ఎస్ స్పష్టం చేసింది. మరమ్మతులు లేదా పునరుద్ధరణ చర్యలకు ముందు బోర్‌హోల్, కోర్ డ్రిల్లింగ్, ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ (ఈఆర్‌టీఎ) వంటి అదనపు ఇంజినీరింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. ప్రాజెక్టు నిర్మాణానికి ముందు సమగ్ర భూగర్భ అన్వేషణ జరగకపోవడం వల్లే ఇటువంటి అంశాలు ముందుగానే గుర్తించలేకపోయినట్లు ఇంజినీరింగ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం లేదా నీటిపారుదల శాఖ అధికారికంగా స్పందిస్తే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్రాలకు కేంద్రం భారీ వరం

**న్యూఢిల్లీ, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్రాల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర పన్నుల వాటాలో భాగంగా మొత్తం ₹1,09,019 కోట్లను అడ్వాన్స్ రూపంలో రాష్ట్రాలకు విడుదల చేసింది. సాధారణంగా ప్రతి నెల 10వ తేదీన విడుదలయ్యే నిధులను ఈసారి ముందుగానే జమ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వాలకు తక్షణ ఆర్థిక వెసులుబాటు లభించనుంది. అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. మూలధన వ్యయాన్ని పెంచడం, రాష్ట్రాల నగదు ప్రవాహాన్ని మెరుగుపరచడం కూడా ఈ ముందస్తు నిధుల విడుదల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌కు అత్యధికంగా ₹19,208 కోట్లు కేటాయించగా, బీహార్‌కు ₹10,845 కోట్లు విడుదలయ్యాయి. పెద్ద జనాభా, అభివృద్ధి అవసరాల నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాలకు అత్యధిక వాటా దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ₹4,597 కోట్లు, తెలంగాణకు ₹2,370 కోట్లు విడుదలయ్యాయి. ఈ నిధులు రాష్ట్రాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల పనులకు ఉపయోగపడనున్నాయి. సంక్షేమ పథకాలు, వేతనాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరుగుతున్న సమయంలో కేంద్రం ముందుగానే నిధులు విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో రాష్ట్రాలపై తక్షణ ఆర్థిక ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రాజెక్టుల అమలు మరింత వేగవంతం కానుందని భావిస్తున్నారు. ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ ముందస్తు నిధుల విడుదలతో రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా ముందుకు సాగేందుకు అవకాశం లభిస్తుంది. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇంత పెద్ద మొత్తంలో అడ్వాన్స్ విడుదల చేయడం రాష్ట్రాలకు గణనీయమైన ఊరటగా మారిందని వారు అభిప్రాయపడుతున్నారు.

# బైరామల్‌గూడ చెరువులో విషాదం

- **9 నెలల చిన్నారిని చెరువులో ముంచి చంపిన తల్లి.. నిందితురాలు పోలీసుల అదుపులో**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2 – ఎల్‌బీనగర్:**



రంగారెడ్డి జిల్లా ఎల్‌బీనగర్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. తొమ్మిది నెలల చిన్నారిని చెరువులో ముంచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, మృత చిన్నారి లోకసాని అనురాధ (9 నెలలు), ఇంజాపూర్‌కు చెందిన లోకసాని రాజేశ్వరి (34) కుమార్తె. ఆదివారం సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో బైరామల్‌గూడ చెరువు వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. ఘటన అనంతరం చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితురాలు రాజేశ్వరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ప్రాథమిక విచారణలో ఘటన జరిగిన సమయంలో రాజేశ్వరి మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అయితే హత్యకు దారితీసిన అసలు కారణాలు ఇంకా వెల్లడికాలేదు. కుటుంబ పరిస్థితులు, మానసిక స్థితి, ఇతర కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పొలంలో కనిపించిన మొసలిని తాళ్లతో కట్టేసి భుజాన వేసుకుని వెళ్లిన రైతు

- **బిహార్‌లో వైరల్ వీడియో.. అటవీ అధికారులకు అప్పగించిన రైతు**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2:**



బిహార్‌లో ఓ రైతు చూపిన ధైర్యసాహసం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన పొలంలో కనిపించిన మొసలిని తాళ్లతో బంధించి భుజాన వేసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన ఘటన చర్చనీయాంశమైంది. సమాచారం ప్రకారం, బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ అనే రైతు తన వ్యవసాయ పొలంలో మొసలిని గుర్తించాడు. వెంటనే అటవీ శాఖ కార్యాలయానికి వెళ్లి సమాచారం ఇవ్వగా, ఆ సమయంలో అక్కడ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్వయంగా మొసలిని తాళ్లతో బంధించాడు. అనంతరం మొసలిని భుజాలపై మోసుకుంటూ సమీప పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకుని మొసలిని తమ ఆధీనంలోకి తీసుకొని సురక్షితంగా సమీప నదిలో విడిచిపెట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. రైతు ధైర్యాన్ని కొందరు ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇలాంటి సందర్భాల్లో స్వయంగా ప్రమాదకర జంతువులను పట్టుకునే ప్రయత్నం చేయకుండా వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు.

# పాకిస్తాన్‌లో శాంతి ర్యాలీపై ఉగ్రదాడి

- **ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో భారీ పేలుడు.. 9 మంది మృతి, పలువురికి తీవ్ర గాయాలు**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2:**

పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన భారీ పేలుడు తీవ్ర విషాదానికి దారితీసింది. శాంతి ర్యాలీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన పేలుడులో కనీసం తొమ్మిది మంది మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది, సహాయక బృందాలు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. పేలుడు జరిగిన ప్రాంతాన్ని భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. పేలుడుకు బాధ్యులెవరు, ఏ ఉగ్రవాద సంస్థ ప్రమేయం ఉందనే అంశంపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనను పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. శాంతి, సామరస్యాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఉగ్రవాదులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. ఘటన అనంతరం ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

# జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 31 వరకు పోలీస్ యాక్ట్ సెక్షన్-30 అమలు

- **అనుమతి లేకుండా రాజకీయ సభలు, ర్యాలీలు, ధర్నాలు నిషేధం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**

**ఆశ్వి అప్డేట్స్, నారాయణపేట, ఆగస్టు 2:**

నారాయణపేట జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలగకుండా ఉండేలా భారత పోలీస్ చట్టం 1861లోని సెక్షన్30ను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఐపీఎస్ తెలిపారు. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు ఆగస్టు 31 వరకు అమల్లో ఉంటాయని వెల్లడించారు.

జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తే అవకాశాల నేపథ్యంలో ప్రజాహితం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఉత్తర్వుల ప్రకారం, ముందస్తు పోలీసు అనుమతి లేకుండా ఎలాంటి రాజకీయ సభలు, ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మైక్‌లు, లౌడ్‌స్పీకర్లు వినియోగించాలంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు లిఖితపూర్వక అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు.

అదేవిధంగా పండుగలు, సంప్రదాయ వేడుకలు, మతపరమైన కార్యక్రమాలు, ఊరేగింపుల నిర్వహణకు కూడా నిర్వాహకులు సంబంధిత పోలీసు అధికారులను ముందుగానే సంప్రదించి అనుమతులు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు.

ప్రజలు పోలీసు శాఖకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడాలని, ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ హెచ్చరించారు.




# అదృశ్యమైన యువకుడి ఆచూకీ కోసం వెళ్తుండగా విషాదం

- **రోడ్డు ప్రమాదంలో పిన్ని దుర్మరణం.. చిల్కమర్రి గ్రామంలో విషాద ఛాయలు**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2 బాలానగర్/ఫరూఖ్‌నగర్:**

అదృశ్యమైన యువకుడి ఆచూకీ లభించిందన్న సమాచారంతో అతడిని చూసేందుకు ఆసుపత్రికి బయలుదేరిన కుటుంబానికి ఊహించని విషాదం ఎదురైంది. మార్గమధ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి పిన్ని మృతి చెందడంతో రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన చెన్నిగారి శ్రీకాంత్ (22) జూలై 31 సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్లు సమాచారం. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించకపోవడంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గౌతాపూర్ గ్రామ సమీపంలోని వంతెన వద్ద నీటి కుంటలో ఓ యువకుడు పడి ఉన్నాడని స్థానికులు గుర్తించి, 108 అంబులెన్స్ ద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న శ్రీకాంత్ కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి బయలుదేరారు. అయితే ఆసుపత్రికి వెళ్తున్న మార్గంలో బాలానగర్ మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ పిన్ని మనీలా (46) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు, ఇతర వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది.






# ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభ ఘనంగా

- **కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని నాయకుల పిలుపు**

**ఆశ్వి అప్డేట్స్, తుక్కుగూడ, ఆగస్టు 2:**

అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభ ఆదివారం తుక్కుగూడ పట్టణంలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెలకంటి సత్యం, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం కార్మిక సంఘాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కార్మికులు సంఘటితమై తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహాసభలో సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. చంద్రయ్య, జిల్లా కార్యదర్శి పానుగంటి పర్వతాలు, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దత్తు నాయక్, శేఖర్ రెడ్డి, వడ్ల సత్యనారాయణ, జయపాల్ రెడ్డి, దేవేంద్ర గౌడ్, కొమగల రాజు, ప్రవీణ్ గౌడ్, మద్దిలేటి, చందు యాదవ్, మల్లేష్, శ్రీశైలం, కోటేష్ తదితరులు పాల్గొన్నారు. మహాసభలో కార్మిక సమస్యలు, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- **ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం 44.89 లక్షల ఓట్లు తగ్గినట్లు వెల్లడి**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2:**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియ అనంతరం విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 44,89,512 ఓట్లు తగ్గినట్లు వెల్లడైంది. అధికారిక వివరాల ప్రకారం, గతంలో రాష్ట్రంలో సుమారు 4.16 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ప్రత్యేక సవరణ ప్రక్రియలో 3.71 కోట్ల మంది మాత్రమే తమ వివరాలను ధ్రువీకరిస్తూ ఫారాలు సమర్పించారు. ఫారాలు సమర్పించని నమోదుల పరిశీలనలో 15.22 లక్షల మంది మృతులు, 22.30 లక్షల మంది వలస వెళ్లిన లేదా అందుబాటులో లేని ఓటర్లు, 7.37 లక్షల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

తాజా ముసాయిదా జాబితా ప్రకారం రాష్ట్రంలో 1.89 కోట్ల మంది మహిళా ఓటర్లు, 1.82 కోట్ల మంది పురుష ఓటర్లు నమోదైనట్లు పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సవరణల కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులో దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం వాటిని పరిశీలించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు.





# 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- **ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసేలా సమన్వయంతో పనిచేయాలి: వనపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్, ఆగస్టు 2:**

భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న "హర్ ఘర్ తిరంగా - ఘర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని గడ్డిఅన్నారం డివిజన్ పరిధి సిండికేట్ బ్యాంక్ కాలనీలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వనపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపు మేరకు ఆగస్టు 11 నుంచి 13 వరకు ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడేలా బూత్ స్థాయి కార్యకర్తల నుంచి జాతీయ స్థాయి నాయకుల వరకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం దేశభక్తిని, జాతీయ ఐక్యతను ప్రతి ఇంటికి చేరవేసే మహత్తర ఉద్యమమని, ప్రతి కుటుంబం ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, కార్యక్రమం అమలు విధానం, బూత్ వారీ కార్యాచరణ, జాతీయ జెండాల పంపిణీ, ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలపై నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో రంగారెడ్డి (అర్బన్) జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కృష్ణ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు, హర్ ఘర్ తిరంగా కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్, కోకన్వీనర్ శ్రవణ్ గౌడ్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సృజన యాదవ్, పారంద సాయి, సీనియర్ నాయకుడు సుధాకర్ రెడ్డి, సీనియర్ సిటిజన్లు, వివిధ కాలనీల ప్రతినిధులు, మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీపీఎం రాజకీయ శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై అవగాహన

- **రెండో రోజు తరగతులకు మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు బోధన**

**ఆశ్వి అప్డేట్స్, రామన్నపేట, ఆగస్టు 2:**




సీపీఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణా తరగతులు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ చెరుపల్లి సీతారాములు పాల్గొని ప్రస్తుత రాజకీయ పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, సామాజికఆర్థిక పరిణామాలు, ప్రజా సమస్యలు, వామపక్ష ఉద్యమాల పాత్ర వంటి అంశాలను ఆయన విశ్లేషిస్తూ పార్టీ కార్యకర్తలు ప్రజలతో మమేకమై ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను కార్యకర్తలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించాలని, పార్టీ సిద్ధాంతాలను సమాజంలో విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ రాజకీయ శిక్షణా తరగతుల్లో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సైబరాబాద్‌లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

- **333 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబాటు.. కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2 – సైబరాబాద్:**



సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 333 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో 269 మంది ద్విచక్ర వాహనదారులు, 11 మంది ఆటో డ్రైవర్లు, 51 మంది కార్ల డ్రైవర్లు, 2 మంది హెవీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. తనిఖీల్లో బ్రెత్ అనలైజర్ పరీక్షల ద్వారా వారి రక్తంలో ఆల్కహాల్ శాతం (BAC)ను నిర్ధారించారు. పోలీసుల వివరాల ప్రకారం, 262 మందిలో BAC 36-200 mg/100 ml, 50 మందిలో 201-300 mg/100 ml, 21 మందిలో 301-550 mg/100 ml నమోదైంది. అధిక స్థాయిలో మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. అలాగే, గత వారం నమోదైన 232 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టు పరిష్కరించింది. వీరిలో ముగ్గురికి జరిమానాతో పాటు జైలు శిక్ష, ఆరుగురికి జరిమానాతో పాటు సామాజిక సేవ (సోషల్ సర్వీస్) విధించగా, 223 మందికి జరిమానా మాత్రమే విధించినట్లు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రమాదానికి కారణమై ప్రాణనష్టం సంభవిస్తే భారతీయ న్యాయ సంహిత (BNS) 2023 సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నేరం రుజువైతే గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, మద్యం సేవించిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపవద్దని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.





# 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో యువతకు ప్రధాని మోదీ సందేశం

- **సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో వర్చువల్ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం.. మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత ప్రతిజ్ఞ**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2 – రంగారెడ్డి:**

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ (MY Bharat) సంస్థ చేపట్టిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతను ఉద్దేశించి చేసిన వర్చువల్ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 10 వేల కేంద్రాల్లో నిర్వహించిన ఈ జాతీయ కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యమై మాదకద్రవ్యాల నిర్మూలనపై తమ నిబద్ధతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ, మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన పౌరులుగా క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, స్వచ్ఛంద సేవా భావంతో ముందుకు సాగి వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని పేర్కొంటూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ప్రధాని ప్రసంగం అనంతరం విద్యార్థులందరూ 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' ప్రతిజ్ఞ చేశారు. తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులను కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములను చేస్తామని సంకల్పించారు. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన 100 వారాల యువజన అవగాహన కార్యక్రమానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. కార్యక్రమాన్ని మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ధ్యానేశ్వర్ బసుట్కర్ సమన్వయం చేయగా, సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎ. రాజిరెడ్డి మార్గదర్శకత్వంలో, ప్రొఫెసర్ ఎం. సాహుల్ సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమతి స్నేహల్ ధ్యానేశ్వర్ బసుట్కర్ మాట్లాడుతూ, యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి యువకుడు 'నషా ముక్త్ భారత్' ఉద్యమానికి రాయబారిగా వ్యవహరించి మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తమ వంతు పాత్ర పోషిస్తామని, మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజంలోని ప్రతి వర్గానికి తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.







# స్నేహితుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

- **40 యూనిట్ల రక్త సేకరణ.. రక్తదానం ప్రాణదానంతో సమానం: మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్**

**ఆశ్వి అప్డేట్స్, సిద్దిపేట, ఆగస్టు 2:**

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రభుత్వాసుపత్రి రక్తనిధి కేంద్రం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిబిరంలో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ప్రజలు అపోహలను నమ్మకుండా ముందుకు రావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, అత్యవసర వైద్య పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరమవుతుందని, ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎందరో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సాయిరాం మాట్లాడుతూ, "రక్తదానం ప్రాణదానంతో సమానం" అని అన్నారు. ముఖ్యంగా చిన్నారులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం ఎక్కువగా ఉంటుందని, స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గందె సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంప శివకుమార్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, మట్టి వినాయక విగ్రహాల పంపిణీ, రక్తదాన శిబిరాల నిర్వహణ వంటి సామాజిక కార్యక్రమాలను నిరంతరం చేపడుతున్నామని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమం అనంతరం స్వచ్ఛందంగా రక్తదానం చేసిన చంద్రశేఖర్ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద రక్తదాతలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతులను తప్పుదోవ పట్టించే కథనాలు ప్రచురించొద్దు

- **వాస్తవాలు నిర్ధారించుకుని వార్తలు రాయాలి.. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవు: ఏఎంసీ చైర్మన్ సదాశివరెడ్డి**

**ఆశ్వి అప్డేట్స్, నారాయణపేట, ఆగస్టు 2:**

రైతులను తప్పుదోవ పట్టించే అసత్య కథనాలు ప్రచురించడం మానుకోవాలని నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ సదాశివరెడ్డి కోరారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఆదివారం రైతులు, పేరపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఇటీవల కొన్ని పత్రికల్లో ప్రచురితమైన కథనాల్లో వాస్తవాలు లేకుండా, పూర్తి వివరాలు తెలుసుకోకుండా తప్పుడు ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. రైతులకు నిజంగా ఎక్కడైనా అన్యాయం జరిగితే లేదా ఎవరైనా అక్రమంగా డబ్బులు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాంటి అంశాలపై తక్షణమే చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అసత్య ప్రచారం వల్ల రైతుల్లో అయోమయం ఏర్పడటంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు. అందువల్ల పూర్తి నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని మీడియాను విజ్ఞప్తి చేశారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం సాగునీరు, తాగునీటి పరంగా సస్యశ్యామలంగా మారుతుందని, రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అసత్య, ఆధారరహిత కథనాలు కొనసాగితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పేరపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరణప్ప, మాజీ ఎంపీటీసీ కె. శంకర్, రాంగోపాల్, రైతులు వడ్ల వెంకటేష్, రాములు, శ్రీనివాస్, కుంటి వెంకటప్ప, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలనకు యువత సంకల్పం

- **వర్గల్‌లోని కావేరి యూనివర్సిటీలో 'నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం.. వర్చువల్‌గా యువతతో ప్రధాని మోదీ సంభాషణ**

**ఆశ్వి అప్డేట్స్, సిద్దిపేట, ఆగస్టు 2:**

యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యపరిచే లక్ష్యంతో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ (MY Bharat) చేపట్టిన "నశా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా యువతతో వర్చువల్‌గా సంభాషించారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని కావేరి యూనివర్సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సాహం, యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 10 వేల కేంద్రాల నుంచి కోటి మందికి పైగా యువత, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న యువత 'నశా ముక్తి' ప్రతిజ్ఞ చేసి, తాము మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా చైతన్యపరుస్తామని సంకల్పించారు. "ఏక్ సంకల్ప్ – ఏక్ భారత్, నశా ముక్త యువ – ఫర్ వికసిత్ భారత్", "Gen Z Against Addiction" వంటి నినాదాలతో కార్యక్రమం కొనసాగింది. వచ్చే 100 వారాల పాటు ప్రతి ఆదివారం యువత భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫిట్‌నెస్, ధ్యానం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా స్థాయిలో జానపద గీతాలు, మైమ్, షార్ట్ ఫిల్మ్స్, రీల్స్, చిత్రలేఖనం, వాదోపవాదాలు, నినాద రచన పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయికి పంపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామసభల ద్వారా నశా ముక్త సంకల్ప సభలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సంతకాల సేకరణ, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమం ఆగస్టు 14, 2026న న్యూఢిల్లీలో జరిగే జాతీయ నశా ముక్త యువ కాన్‌క్లేవ్తో ముగియనుండగా, దేశవ్యాప్తంగా విశేష ప్రతిభ కనబరిచిన యువతను ఆ సందర్భంగా సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావేరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. వి. ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ డా. శ్రీనివాసులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# ఢిల్లీ హైకోర్టు కీలక నిర్ణయం.. 137 మంది జడ్జీల బదిలీ

- **పేపర్ లీక్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి అను గ్రోవర్ బాలిగా కూడా బదిలీ**

**న్యూఢిల్లీ, ఆశ్వి అప్డేట్స్:**

ఢిల్లీ హైకోర్టు న్యాయవ్యవస్థలో భారీ స్థాయిలో బదిలీలు చేపట్టింది. పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అను గ్రోవర్ బాలిగా సహా మొత్తం 137 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం న్యాయవర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. హైకోర్టు జారీ చేసిన పరిపాలనా ఉత్తర్వుల ప్రకారం జిల్లా న్యాయవ్యవస్థలో సాధారణ బదిలీలు, పదోన్నతులు, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది. బదిలీ అయిన న్యాయమూర్తులకు కొత్త కోర్టులు, బాధ్యతలు కేటాయించనున్నట్లు సమాచారం. అయితే పేపర్ లీక్ కేసులను విచారిస్తున్న ప్రత్యేక న్యాయమూర్తి కూడా బదిలీ జాబితాలో ఉండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో సంబంధిత కేసుల విచారణపై ఎలాంటి ప్రభావం ఉంటుందనే అంశంపై చర్చ సాగుతోంది. సాధారణంగా ఇటువంటి సందర్భాల్లో కొత్తగా బాధ్యతలు స్వీకరించే న్యాయమూర్తి వద్ద విచారణ కొనసాగుతుంది. దీంతో కేసుల విచారణ నిలిచిపోదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ బదిలీలపై ఢిల్లీ హైకోర్టు నుంచి ప్రత్యేకంగా పేపర్ లీక్ కేసులను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు వెలువడలేదు. పరిపాలనా ప్రక్రియలో భాగంగానే ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా న్యాయ, విద్యా వర్గాల దృష్టిని ఆకర్షించింది.

# జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ప్రవాహం

- **27 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల.. 434 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి**

**ఆశ్వి అప్డేట్స్, ఆగస్టు 2 – జోగులాంబ గద్వాల:**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టుకు వస్తున్న భారీ ఇన్‌ఫ్లో నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ 27 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రస్తుతం ప్రాజెక్టుకు 1,60,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 1,77,000 క్యూసెక్కుల నీటిని ఔట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.33 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరానికి అనుగుణంగా గేట్ల నిర్వహణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఇక ప్రాజెక్టులోని 11 విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు పనిచేస్తుండగా, మొత్తం 434 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. వరద జలాలను వినియోగించుకుంటూ విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు నది పరివాహక ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరించారు.

# దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నిమ్మల విద్యాధరణి

- **దేవాంగ మహిళా శక్తికి కొత్త దిశ – నిమ్మల విద్యాధరణి నియామకం స్వాగతార్హం**

**పెనుకొండ టౌన్. ఆగస్టు 02:**



ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా మాజీ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకురాలు నిమ్మల విద్యాధరణి నియామకం రాష్ట్రవ్యాప్తంగా దేవాంగ మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ నియామకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు, ప్రధాన కార్యదర్శి జక్కుల శివానందం అధికారికంగా ప్రకటించారు. సామాజిక సేవలో అనుభవం, ప్రజా సమస్యలపై అవగాహన, మహిళల సాధికారత కోసం నిరంతరం కృషి చేసిన నాయకురాలిగా నిమ్మల విద్యాధరణి గుర్తింపు పొందారు. ఆమె నాయకత్వంలో దేవాంగ మహిళలను సంఘటితం చేయడం, చేనేత కుటుంబాల సంక్షేమం, యువతులు మరియు మహిళలకు ఉపాధి, విద్య, స్వయం ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని సంఘం నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. దేవాంగ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనది. కుటుంబం నుంచి సమాజం వరకు ప్రతి రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగితేనే అభివృద్ధి వేగవంతమవుతుంది. అలాంటి సమయంలో అనుభవజ్ఞురాలైన నాయకురాలికి రాష్ట్ర మహిళా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సముచిత నిర్ణయంగా పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ సద్దా శివ, రాష్ట్ర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ స్టేట్ కోఆర్డినేటర్ దేవాంగం పాపన్నతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ నిమ్మల విద్యాధరణికి అభినందనలు తెలిపారు. ఆమె నాయకత్వంలో దేవాంగ మహిళా విభాగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాంగ మహిళలను ఒకే వేదికపైకి తీసుకురావడం, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, చేనేత రంగ పరిరక్షణకు మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి లక్ష్యాలతో మహిళా విభాగం ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తమవుతోంది. దేవాంగ సమాజ అభ్యున్నతి కోసం మహిళా నాయకత్వానికి ఇచ్చిన ఈ ప్రాధాన్యం భవిష్యత్‌లో సంఘం కార్యకలాపాలకు మరింత బలం చేకూర్చి, రాష్ట్రవ్యాప్తంగా దేవాంగ మహిళల ఐక్యతకు నాంది పలుకుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య గారికి ఘన నివాళి

**ఆశ్వి అప్డేట్స్**



భారత జాతీయ పతాకాన్ని రూపుదిద్ది, ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి జ్యోతిని వెలిగించిన మహనీయుడు పింగళి వెంకయ్య గారు. జాతిపిత మహాత్మా గాంధీ ప్రశంసలు అందుకుని, తన అద్భుత దూరదృష్టి, దేశసేవా తపనతో భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. పింగళి వెంకయ్య గారి 150వ జయంతి సందర్భంగా ఆ మహనీయుని పావన స్మృతికి ఘన నివాళులు అర్పిద్దాం.

"మన త్రివర్ణ పతాకం రెపరెపలాడే ప్రతి సారి... పింగళి వెంకయ్య గారి దేశభక్తి, త్యాగం, సేవాస్ఫూర్తిని గర్వంగా స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యం."



# బారాముల్లాలో ఉగ్ర అనుమానితుడి అరెస్టు

- కశ్మీర్‌లో భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- షేరీ సెక్టార్‌లో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్న బలగాలు
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- కుల్గాంలో వలస కార్మికుల హత్య కేసులో ముమ్మర గాలింపు
- భద్రతా పరిస్థితులపై ఎల్‌జీ మనోజ్ సిన్హా సమీక్ష

శ్రీనగర్, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలపై భద్రతా దళాల చర్యలు కొనసాగుతున్నాయి. బారాముల్లా జిల్లాలోని షేరీ సెక్టార్ పరిధిలో సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన భద్రతా బలగాలు ఓ ఉగ్ర అనుమానితుడిని అరెస్టు చేశాయి. అతని వద్ద నుంచి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఫతాగఢ్ ప్రాంతంలో అనుమానాస్పద కదలికలపై సమాచారం అందడంతో భారత సైన్యానికి చెందిన 46వ రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ 53వ బెటాలియన్ సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నాయి. అయితే అతని గుర్తింపు, స్వాధీనం చేసుకున్న ఆయుధాల వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు.

అరెస్టు చేసిన వ్యక్తికి ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నాయా, గతంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్నాడా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఆయుధాలు ఎక్కడి నుంచి వచ్చాయి, అతనికి సహకరించిన వ్యక్తులు ఎవరనే అంశాలపై కూడా దర్యాప్తు సాగుతోంది.

మరోవైపు కుల్గాం జిల్లాలో ఇద్దరు వలస కార్మికుల హత్య ఘటన తర్వాత భద్రతా బలగాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను గుర్తించేందుకు పలు ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని అధికార నేషనల్ కాన్ఫరెన్స్, ప్రతిపక్ష పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ డిమాండ్ చేశాయి.

పరిస్థితిని సమీక్షించిన జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై ఉగ్రవాద వ్యతిరేక చర్యలను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న వలస కార్మికుల భద్రతకు అమలులో ఉన్న విధివిధానాలను సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగానికి సూచించారు. డీజీపీ నలిన్ ప్రభాత్‌తో పాటు ఇతర భద్రతా సంస్థల ఉన్నతాధికారులు సంఘటనా ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడం, ఆయుధాల సరఫరా మార్గాలను అడ్డుకోవడం, సాధారణ ప్రజలు మరియు వలస కార్మికుల భద్రతను మరింత బలోపేతం చేయడంపై భద్రతా దళాలు ప్రత్యేక దృష్టి సారించాయి.

# డ్రగ్స్ రహిత యువతతోనే వికసిత్ భారత్

- 'నశా ముక్త్ యువ' జాతీయ ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 100 వారాల పాటు అవగాహన కార్యక్రమాలు
- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రధాని పిలుపు
- 10 వేలకుపైగా ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం

న్యూఢిల్లీ, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్



డ్రగ్స్ రహిత యువతే అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి బలమైన పునాది అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. యువతను మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి దూరంగా ఉంచి, సామాజిక మార్పుకు భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 100 వారాల పాటు ఈ ప్రచారం కొనసాగనుంది. ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కేవలం వ్యక్తుల కోసమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ భవిష్యత్తు కోసం చేపట్టిన ప్రజా ఉద్యమమని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన యువత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్ వంటి ప్రమాదకర అలవాట్లకు యువత పూర్తిగా దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని గత ఏడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందని ప్రధాని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో 125కు పైగా ఆధ్యాత్మిక సంస్థలు, సామాజిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవడం సంతోషకరమని చెప్పారు. మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటం ఒక్కరి వల్ల సాధ్యం కాదని, ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకొస్తేనే విజయవంతమవుతుందని మోదీ అన్నారు. ఇప్పటికే లక్షలాది మంది యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారని, తమ పాఠశాలలు, కళాశాలలు, సమాజాల్లో అవగాహన కల్పించేందుకు ముందుకు వస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా పోటీలు, వాక్‌థాన్‌లు, ధ్యాన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, నాటకాలు, చర్చా వేదికలు, చిత్రలేఖన పోటీలు, కమ్యూనిటీ కార్యక్రమాలు నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం కల్పించనున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన పౌరులతోనే అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించవచ్చని అన్నారు. 2020లో డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని ప్రధాని ప్రకటించారని గుర్తుచేస్తూ, తాజా ప్రచారం ఆ సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. దేశవ్యాప్తంగా 10 వేలకుపైగా ప్రాంతాల్లో విద్యాసంస్థలు, యువజన సంఘాలు, సివిల్ సొసైటీ సంస్థలు, పరిశ్రమల సంఘాలు, ఆధ్యాత్మిక సంస్థలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, మై భారత్ వాలంటీర్లు, యువజన క్లబ్బులు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ ఉద్యమంలో భాగస్వాములవుతున్నాయి. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతే మార్పుకు రాయబారులుగా నిలవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. 100 వారాల పాటు కొనసాగే ఈ జాతీయ ప్రచారం ద్వారా డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# జంతర్‌మంతర్ నిరసనల్లో అల్లర్ల కుట్ర?

- పాక్ ఉగ్ర నెట్‌వర్క్‌తో యువజంటకు సంబంధాల ఆరోపణలు
- పశ్చిమ బెంగాల్ ఎస్టీఎఫ్ దర్యాప్తులో సంచలన అంశాలు
- జంతర్‌మంతర్ నిరసనల్లో గందరగోళం సృష్టించాలని పాక్ హ్యాండ్లర్ల ఆదేశాల ఆరోపణ
- హనీట్రాప్ ముఠా నిర్వహణపై దర్యాప్తు
- ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్ నుంచి ఆదేశాల మార్పిడి

కోల్‌కతా, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్





పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద నెట్‌వర్క్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగుచూశాయి. బర్ధమాన్‌లో హమీమ్ మొండల్‌ను, అనంతరం జార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్‌లో అతని స్నేహితురాలు అర్పితా సర్కార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో పాకిస్థాన్ హ్యాండ్లర్ల సూచనల మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో అల్లర్లు, గందరగోళం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తు ప్రకారం, ఈ కార్యకలాపాల కోసం పోలీసు యూనిఫారాలు కొనుగోలు చేసి మహిళలు, పురుషులతో కూడిన బృందంతో ఢిల్లీకి వెళ్లాలని హమీమ్‌కు సూచనలు అందినట్లు అధికారులు పేర్కొన్నారు. గత నాలుగు నుంచి ఐదు నెలలుగా అతను పాక్ ఆధారిత నెట్‌వర్క్ ప్రభావంలోకి వెళ్లినట్లు గుర్తించినట్లు తెలిపారు.

హమీమ్ బాధ్యతల్లో రాజకీయ నాయకులు, వీఐపీలు, పోలీసు అధికారుల వివరాలు సేకరించడం, కొత్త వ్యక్తులను నెట్‌వర్క్‌లోకి చేర్చడం కూడా ఉన్నట్లు ఎస్టీఎఫ్ వెల్లడించింది. నాలుగేళ్లుగా పరిచయమున్న అర్పితా సర్కార్‌ను కూడా ఈ కార్యకలాపాల్లో భాగస్వామిని చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభావశీల వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని హనీట్రాప్ ముఠాను నిర్వహించినట్లు, అర్పితా ద్వారా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ సీనియర్ మంత్రి కుమారుడిని కూడా హనీట్రాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.

వీరిద్దరూ వాట్సాప్, టెలిగ్రామ్, ఎలిమెంట్ ఎక్స్, సెషన్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరిపినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో అబీర్ జాట్ 333, ఉజైర్, రాణా, హమద్ అనే నలుగురు కీలక హ్యాండ్లర్లను గుర్తించినట్లు ఎస్టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ వెల్లడించారు. వీరు బ్రిటన్, మెక్సికో సిమ్ కార్డులను ఉపయోగిస్తూ యువతను తీవ్రవాద భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించారు.

అర్పితా సర్కార్‌ను కోర్టు 13 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి అప్పగించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ఈ నెట్‌వర్క్‌తో సంబంధాలున్న మరికొందరిపై కూడా విచారణ జరుగుతోందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఆరోపణలకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది.

# ఢిల్లీలో ఎంపీ పప్పు యాదవ్‌పై దాడి యత్నం

- ప్రెస్‌మీట్‌లో షూ విసిరి.. కత్తితో దాడికి ప్రయత్నం
- అధికారిక నివాసంలో జరిగిన ఘటనతో కలకలం
- అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, అనుచరులు దుండగులను పట్టివేత
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- తన హత్యకు కుట్ర జరుగుతోందని ఎంపీ ఆరోపణ

న్యూఢిల్లీ, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్



బీహార్‌లోని పూర్ణియా లోక్‌సభ నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ రాజేష్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్‌పై ఢిల్లీలో దాడి యత్నం చోటుచేసుకుంది. ఆయన అధికారిక నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో రాజకీయ వర్గాల్లో కలకలం రేగింది.

సమావేశం కొనసాగుతుండగా ఓ వ్యక్తి ఒక్కసారిగా పప్పు యాదవ్ వైపు షూ విసిరాడు. అదే సమయంలో అక్కడే ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే భద్రతా సిబ్బంది, అనుచరులు వెంటనే అప్రమత్తమై వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.

సమాచారం అందుకున్న ఢిల్లీ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరిని ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షెహర్‌కు చెందిన సుమిత్‌గా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఘటనకు గల కారణాలు, దాడి వెనుక ఉన్న నేపథ్యంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఘటన అనంతరం స్పందించిన పప్పు యాదవ్ తనను హత్య చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇలాంటి దాడులకు తాను భయపడబోనని, ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను చంపాలని ఎవరైనా భావిస్తే చంపనివ్వండి. కానీ ప్రజల కోసం నా పోరాటం ఆగదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సహా పలువురు గ్యాంగ్‌స్టర్ల నుంచి తనకు ప్రాణహాని హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో, అధికారిక నివాసంలోనే ఈ దాడి యత్నం జరగడం భద్రతా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఘటనపై ఢిల్లీ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సీజేపీ నిధులపై విచారణ కోరిన ఆర్టీఐ కార్యకర్త

- రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై అధికారులకు ఫిర్యాదు
- ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు లేఖ
- సంస్థ చట్టబద్ధ హోదాపై విచారణ చేయాలని డిమాండ్
- వ్యవస్థాపకుడి కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ప్రశ్నలు
- రూ.1 కోటి విరాళం ప్రకటించిన కపిల్ సిబల్

న్యూఢిల్లీ, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్



సీజేపీ (సీజేపీ) ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు సంబంధించి ప్రకటించిన రూ.1 కోట్ల విరాళం నేపథ్యంలో ఆ సంస్థ కార్యకలాపాలపై విచారణ చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం, కేంద్ర జీఎస్టీ అధికారులకు ఆయన లేఖలు పంపినట్లు తెలిపారు. సీజేపీ రాజకీయ పార్టీగా నమోదు కాకపోయినా రాజకీయ పార్టీ తరహాలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని అమిత్ తివారీ ఆరోపించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 29ఏ ప్రకారం సంస్థ నమోదు అయిందా లేదా అనే అంశాన్ని ఎన్నికల సంఘం పరిశీలించాలని కోరారు. నమోదు లేకపోతే రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజల నుంచి నిధులు సేకరించడం వంటి అంశాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మహారాష్ట్ర ప్రభుత్వంలో విశ్రాంత ఉద్యోగిగా పనిచేసిన అభిజిత్ దీప్కే తండ్రి భగవాన్‌రావు దీప్కే ఆర్థిక పరిస్థితిని పరిశీలించాలని, అలాగే అభిజిత్ దీప్కే విదేశాల్లో ఉన్నత విద్య కోసం అవసరమైన నిధులు ఎలా సమకూరాయో కూడా సంబంధిత సంస్థలు విచారణ చేయాలని డిమాండ్ చేశారు. రూ.1 కోట్ల లీగల్ డిఫెన్స్ ఫండ్‌పై 18 శాతం జీఎస్టీ వర్తిస్తుందా లేదా అనే అంశాన్ని కూడా కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు పరిశీలించాలని తివారీ కోరారు. నిధుల స్వీకరణ, వినియోగం ప్రస్తుత పన్ను నిబంధనలకు అనుగుణంగా జరిగిందా అనే విషయంపై స్పష్టత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ సీజేపీ ఏర్పాటు చేసిన లీగల్ డిఫెన్స్ ఫండ్‌కు రూ.1 కోటి విరాళం అందజేస్తున్నట్లు ప్రకటించారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుకు సంబంధించిన నిరసనల సందర్భంగా నమోదైన కేసుల్లో చిక్కుకున్న వారికి న్యాయ సహాయం అందించేందుకు ఈ నిధిని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయితే అమిత్ తివారీ చేసిన ఆరోపణలు ప్రస్తుతం ఆరోపణల స్థాయిలోనే ఉన్నాయి. వాటిపై సంబంధిత అధికార సంస్థలు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సీజేపీ చట్టపరమైన హోదా, నిధుల సేకరణ విధానం, పన్ను నిబంధనల అమలు వంటి అంశాలపై అధికారిక స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.




# రాజకీయాల్లోకి సీజేపీ అడుగు?

- ఆగస్టు 5న భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయం
- ఉద్యమ సంస్థగా కొనసాగాలా.. రాజకీయ పార్టీగా మారాలా?
- కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం
- యువత మద్దతుతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సంస్థ

న్యూఢిల్లీ, ఆగస్టు 2, ఆశ్వి అప్డేట్స్

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) రాజకీయ రంగ ప్రవేశంపై కీలక నిర్ణయం తీసుకోనుంది. ఉద్యమ సంస్థగా కొనసాగాలా? లేక రాజకీయ పార్టీగా మారాలా? అనే అంశంపై ఆగస్టు 5న నిర్వహించే కోర్ కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాలను పరిశీలించిన అనంతరం నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది. సమావేశం తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడిస్తారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ ఉద్యమం తర్వాత అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో సీజేపీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. అయితే సీజేపీని కేవలం విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే ఉద్యమ వేదికగానే కొనసాగిస్తామని అభిజీత్ దీప్కే గతంలో స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య, శాంతియుత మార్గాల్లోనే పోరాటాలు కొనసాగిస్తామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఇతర పార్టీల్లో విలీనం కాబోమని ప్రకటించారు. ప్రస్తుతం విద్యా రంగ సమస్యలు, యువత ఎదుర్కొంటున్న అంశాలపై ఉద్యమాలను కొనసాగిస్తూ ప్రభావవంతమైన శక్తిగా నిలవడమే సీజేపీ ముందున్న సవాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా ఆధారంగా వేగంగా విస్తరించడం, పెద్ద సంఖ్యలో యువతను ఆకర్షించడం వంటి అంశాలు ఈ సంస్థకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని పేర్కొంటున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక ఇతర శక్తుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నప్పటికీ, సమాజంలో ఉన్న అసంతృప్తి, సమస్యలే ఇలాంటి ఉద్యమాలకు కారణమవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆగస్టు 5 సమావేశంలో తీసుకునే నిర్ణయం సీజేపీ భవిష్యత్ దిశను నిర్ణయించనుంది.

# కుర్చీకే అతుక్కుపోతున్నారా? మీరు డేంజర్ లో పడ్డట్టే..!

ప్రస్తుతం కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలే ఎక్కువ. దాదాపుగా 90 శాతం మంది ఇటువంటి జాబ్స్ చేస్తున్నారు. దీంతో రోజులో ఎక్కువ గంటలు కుర్చీకి అతుక్కుపోవాల్సి వస్తోంది. ఇంట్లో కూడా ఖాళీ సమయం దొరికినప్పుడల్లా అలా సోఫాలో వాలిపోయి టీవీ చూసేస్తున్నారు. వాకింగ్ , ఇతర వర్కవుట్స్ చేసేందుకు పెద్దగా టైమ్ ఉండటం లేదు. అయితే దీని వల్ల చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవి ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం. చాలా మంది ఉద్యోగులు 8 నుంచి12 గంటలు కంప్యూటర్ల దగ్గర పనిచేసే వాళ్లు ఉన్నారు.



### కుర్చీలో కూర్చొని పనిచేస్తే సమస్యలు ఇవే..!

ఆఫీస్ పనిచేసే క్రమంలో చాలా సేపు ఒకటే పొజిషన్ లో మనం కుర్చీలో కూర్చుండి పోతాం. అయితే దీనివల్ల శరీరం దిగువ భాగంలో కొవ్వు పేరుకుపోతుందని చెబుతున్నారు. తప్పుడు పద్ధతిలో కుర్చీపై కూర్చొని గంటల తరబడి పని చేయడం వలన ఏకాగ్రత తగ్గుతుందట. ఎందుకంటే అసౌకర్యంగా కూర్చున్నప్పుడు వ్యక్తి దృష్టి పదే పదే ఒకే చోటికి వెళ్తుంది. కాబట్టి సరైన వీపు, చేయి మద్దతుతో కుర్చీపై కూర్చోవాలి. కుర్చీపై కూర్చొని కంప్యూటర్‌లో పని చేసేవారికి.. కీబోర్డ్‌పై నిరంతరం వేళ్లను కదిలించే వారికి చేతులు, భుజాలలో నొప్పి వస్తుంది. రక్త ప్రసరణ కూడా దెబ్బతింటుంది. భుజాలు, పొట్ట, నడుము భాగాల్లో రక్తప్రసరణ సరిగా జరగదు. దీనివల్ల శరీరంలో జలదరింపు, తిమ్మిరి వంటి సమస్యలు వస్తాయి. కుర్చీ మద్దతు ఇవ్వకపోతే, మద్దతు లేకుండా కూర్చొని ఉంటే.. అది నడుము నొప్పిని కలిగిస్తుంది. ఈ నొప్పి మెడ నుంచి మొదలై తోక ఎముక వరకు వెళ్తుందని నిపుణులు చెబుతున్నారు.

### విరుగుడు ఏంటి?

ఒకే పొజిషన్ లో ఎక్కువ సేపు కూర్చోకుండా.. కొద్ది సేపు వాకింగ్ చేయడం బెటర్ అని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్ మీద తదేకంగా చూడకుండా కాసేపు ఇతర వస్తువులు చూడటం బెటర్ అని చెబుతున్నారు. ఇక ప్రతి గంటకు ఒక్కసారైనా బ్రేక్ ఇవ్వాలట. మరి కుర్చీలో కూర్చొని ఉద్యోగం చేసేవారు కచ్చితంగా ఈ టిప్స్ పాటించండి.

# మొటిమలు ఎలా పోగొట్టుకోవాలి.. బెస్ట్ టిప్స్ ఇవే..!



మొటిమలు చాలా మందిని వేధించే సమస్య ఇదే. అందమైన మొహం కూడా మొటిమలతో పాడైపోతుంది. ముఖ్యంగా టీనేజ్ పిల్లలను మొటిమలు ఎక్కువగా వేధిస్తాయి. అసలు ఈ మొటిమలు ఎలా పోగొట్టుకోవాలి? నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం..

### ఎటువంటి ఆహార పదార్ధాలు తీసుకోవాలి?

మొటిమలు రాకుండా ఉండాలంటే ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారాలను తినాలి. ఒమేగాత్రీ కొవ్వు ఆమ్లాలు చేపలలో అధికంగా ఉంటాయి. ముఖ్యంగా సాల్మన్, సార్డైన్ వంటి చేపల్లో ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. వీటిని తినడం ద్వారా మొటిమలు సమస్యను తగ్గించుకోవచ్చు.



### ఒమేగా 3తోనే సాధ్యం

ఒక అధ్యయనం ప్రకారం మొటిమల బారిన పడిన వారిలో 98% మందిలో ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాల మోతాదు చాలా తక్కువగా ఉన్నట్టు కనిపించింది. ఎప్పుడైతే ఈ కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉంటాయో మొటిమలు వచ్చే సమస్య కూడా తగ్గుతుంది. ఒమేగా త్రీ కొవ్వు ఆమ్లాలు ఉండే ఆహారం తినడం వల్ల మానసిక ఆరోగ్యం బాగుంటుంది. చర్మ ఆరోగ్యం, అందం పెరుగుతుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.



# మీరు వాడుతున్న నెయ్యి.. అసలైనదా? కల్తీదా? ఇలా గుర్తించండి

రిఫైన్డ్ ఆయిల్ తో పోల్చుకుంటే నెయ్యి ఎంతో ఆరోగ్యకరం. అందుకే ప్రస్తుతం చాలా మంది నూనె వాడకాన్ని తగ్గించి నెయ్యి వాడకం పెంచారు. అయితే మనం రోజు తీసుకొనే నెయ్యి మంచిదేనా? అంటే అసలైనదేనా? లేదంటే కల్తీదా? ఈ విషయం కూడా తెలుకోవాలి. నెయ్యి మేలు చేస్తుందని భావించి కల్తీ నెయ్యి వాడితే మనం ఇంకా ప్రమాదంలో పడ్డట్టే. అసలు మనం వాడుతున్న నెయ్యి అసలైనదా? కల్తీదా? ఎలా తెలుసుకోవాలా? ఈ కథనంలో తెలుకుందాం..

### నీటి పరీక్ష

ఒక గాజు గ్లాసులో కొన్ని నీళ్లు తీసుకోవాలి. అనంతరం అందులో కొంత నెయ్యి వేయాలి. అది నీటిపై తేలితే మంచిదని అర్థం, నీటిలో మునిగితే కల్తీనని అర్థం చేసుకోవాలి.



### అయోడిన్ ఎగ్జామినేషన్

ఒక గిన్నెలో కొంత నెయ్యి తీసుకోవాలి. అనంతరం నెయ్యిలో కొన్ని చుక్కల అయోడిన్ వేసి కలపాలి. ఒకవేళ నెయ్యి రంగు మారితే కల్తీ జరిగినట్లు అర్థం చేసుకోవాలి. రంగు మారకపోతే అది అసలైన నెయ్యి అని అర్థం చేసుకోవాలి.




# చాతిలో మంట తగ్గించే టిప్స్ ఇవే..!

ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరూ చాతిలో మంట సమస్యతో బాధపడుతున్నారు. అయితే కొందరికి గ్యాస్ సమస్య వల్ల చాతిలో మంట వస్తూ ఉంటుంది. మరికొందరు ఊపిరితిత్తుల సమస్య వల్ల చాతిలో మంట సమస్యను ఎదుర్కొంటున్నారు. మన ఆహారం, జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగానే చాతిలో మంట వస్తుందని నిపుణులు చెబుతున్నారు.  కొన్ని సందర్భాల్లో ఛాతిలో మంట పెద్ద సమస్యగా మారకపోయినా కొన్ని విషయాల్లో మాత్రం చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతుంటారు.

### లైట్ తీసుకోకండి..

చాతిలో నొప్పి వస్తే ఎట్టి పరిస్థితుల్లో లైట్ తీసుకోవద్దని.. కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించాలని వైద్య నిపుణులు కోరుతున్నారు. కొన్ని నేచురల్ టిప్స్ పాటించడం ద్వారా కూడా చెక్ పెట్టొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఛాతిలో మంట రావడానికి ప్రధాన కారణాల్లో సమయానికి భోజనం చేయకపోవడమని నిపుణులు చెబుతున్నారు. భోజనానికి భోజనానికి మధ్య ఎక్కువ గ్యాప్ ఇవ్వడం వల్ల కడుపులో అల్సర్ లెవల్స్ పెరుగుతాయి. ఇది ఛాతిలో మంటకు దారి తీస్తుందని అంటున్నారు. ఒకేసారి ఎక్కువగా భోజనం చేసినా ఈ సమస్య బారిన పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కొంచెం కొంచెం ఎక్కువసార్లు తీసుకోవాలని చెబుతున్నారు.



### తిన్నవెంటనే నిద్రపోతున్నారా?

కొందరు తిన్న వెంటనే పడుకుంటుంటారు. అయితే ఇది కూడా ఛాతిలో మంటకు దారి తీస్తుందని నిపునులు చెబుతున్నారు. తిన్న తర్వాత కనీసం గంట తర్వాతే మంచం ఎక్కాలని సూచిస్తున్నారు. తిన్న తర్వాత కనీసం 15 నిమిషాలు నడవడాన్ని అలవాటు చేసుకోవాలి. నిత్యం వాకింగ్ చేయడం వల్ల కూడా ఈ సమస్య నుంచి బయట పడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# ‘ఎల్లమ్మ’లో పర్షిగా దేవిశ్రీ




ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఇప్పుడు ‘ఎల్లమ్మ’ సినిమాతో కథానాయకుడిగా పరిచయం కాబోతున్నారు. వేణు యెల్దండి దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ చిత్రాన్ని దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఆదివారం దేవిశ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి పర్షిగా ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అందులో దేవిశ్రీ చేతిలో కిరీటాన్ని పట్టుకుని పల్లెటూరి కుర్రాడిలా అమాయకత్వంతో నిండిన లుక్‌లో కనిపించారు. ‘‘బలమైన భావోద్వేగాల్ని.. తెలంగాణ సాంస్కృతిక నేపథ్యాన్ని మిళితం చేస్తూ రూరల్ యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందిస్తున్నారు. పర్షిగా దేవిశ్రీ నటన అందర్నీ కట్టిపడేస్తుంది’’ అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమా పాన్ ఇండియా భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.

**దేవిశ్రీ స్వరాలతో ‘కింగ్ 100’..**

కథానాయకుడు నాగార్జున తన 100వ సినిమా కోసం దర్శకుడు రా కార్తీక్‌తో చేతులు కలిపిన సంగతి తెలిసిందే. ‘కింగ్ 100’ వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తోంది. టబు కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పుడీ చిత్ర సంగీత బాధ్యతల్ని దేవిశ్రీ ప్రసాద్‌కి అప్పగించారు. ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. గతంలో నాగ్ దేవిశ్రీల కలయికలో ‘మన్మథుడు’, ‘మాస్’, ‘కింగ్’, ‘కుబేర’ లాంటి మ్యూజికల్ హిట్స్ వచ్చిన నేపథ్యంలో.. ఇప్పుడీ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరగనున్నాయి.

# చిరంజీవి, నాగార్జునతో మల్టీస్టారర్..



మల్టీ స్టారర్ చిత్రాలకు తెలుగులో మంచి ఆదరణ ఉంటుంది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తే.. యావరేజ్ ఉన్నా సరే.. సినిమాను సూపర్ హిట్ చేస్తారు. అందుకే గతంలో ఎక్కువగా మల్టీస్టారర్ చిత్రాలు వచ్చేవి. ఈ మధ్య తెలుగు హీరోలంతా పాన్ ఇండియా సినిమాలపై ఫోకస్ పెట్టడం.. సోలోగా రాణించాలనే తపనతో మల్టీస్టారర్‌పై ఆసక్తి చూపించడం లేదు. అయితే స్టార్స్ కలిసి చేస్తే మాత్రం ఆ సినిమా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పుడు అదే చేయబోతున్నాడు. టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. అనిల్ రావిపూడి సినిమాలు ఎలా ఉంటాయో తెలిసిందే. స్టార్స్‌తో కూడా కామెడీ చేయించి హిట్ కొడతాడు. ఇప్పటికే చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణలతో బ్లాక్ బస్టర్ హిట్స్ తీశాడు. ఇప్పుడు ఆయన ఫోకస్ నాగార్జునపై పడింది. నాగార్జునతో సినిమా చేస్తానని అనిల్ ఎప్పటి నుంచో చెబుతున్నాడు. త్వరతోనే ఈ ప్రాజెక్ట్‌ని పట్టాలపైకి ఎక్కించబోతున్నాడు. ప్రస్తుతం నాగార్జున తన 10వ సినిమాలో బిజీగా ఉన్నాడు. ఇది పూర్తయిన తర్వాత అనిల్‌తో సినిమా చేస్తాడని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం.. నాగార్జునతో సోలో సినిమా కాకుండా చిరంజీవిని కూడా కలిపి మల్టీస్టారర్ రూపొందించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# బుట్టబొమ్మ పెళ్లి చేసుకోనుందా? మరి ఈ రూమర్స్



రీసెంట్ టైంలో రష్మిక పెళ్లి చేసుకుంది. మరో ఒకరిద్దరూ హీరోయిన్లు కూడా వైవాహిక బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. అయితే టాలీవుడ్ బుట్టబొమ్మ పూజాహెగ్డే కూడా త్వరలో కొత్త జీవితం ప్రారంభించనుందని, పెద్దల కుదిర్చిన సంబంధానికి ఓకే చెప్పిందని మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పుకార్లు గట్టిగా వినిపిస్తున్నాయి. మరి ఇందులో నిజమెంత? అసలివి ఎందుకొచ్చాయ్? ఒకప్పుడు తెలుగులో ఎన్టీఆర్, అల్లు అర్జున్, ప్రభాస్ లాంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసి స్టార్‌డమ్ సొంతం చేసుకున్న పూజాహెగ్డే.. ప్రస్తుతం హిందీ, తమిళంలో మాత్రమే చేస్తోంది. ఈమె నటించిన 'జన నాయగన్' వారం క్రితమే రిలీజైంది. కానీ ఈమెకే పెద్దగా పేరు రాలేదు. అంతకు ముందు హిందీలో ఓ మూవీ చేసింది. ఇందులోనూ గ్లామర్ చూపించినప్పటికీ సక్సెస్ అందుకోలేదు.

ప్రస్తుతానికైతే పూజా చేతిలో కాంచన 4, దుల్కర్ సల్మాన్ చేస్తున్న తెలుగు మూవీ 'శ్రీ-శ్రీ'లో నటిస్తోంది. అయితే ఈమెకు ఆఫర్స్ తగ్గిపోవడంతో మూవీస్ చేయడం మునుపటిలా లేదు. ఈ క్రమంలోనే పూజా.. ఓ బిజినెస్‌మ్యాన్‌ని పెళ్లి చేసుకోనుందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఇందులో ఏ మాత్రం నిజం లేదనిపిస్తోంది. లేదంటే ఏమైనా సర్‌ప్రైజ్ ప్లాన్ చేసిందేమో చూడాలి?

# వరుస సినిమాలతో దూసుకెళ్తున్న సాయి పల్లవి

సహజత్వానికి మారుపేరు నటి సాయి పల్లవి . డాక్టర్ అయ్యి యాక్టర్ అయిన ఈ తమిళ నటి ఆదిలో నటనపై ఆసక్తితో తమిళంలో చిన్న చిన్న పాత్రలు పోషించినా, మలయాళంలో ప్రేమమ్ చిత్రంతో అనూహ్యంగా దూసుకొచ్చారు. ఆ తరువాత తమిళం, తెలుగు భాషల్లో అవకాశాలు ఈ భామను వెతుక్కుంటూ వచ్చాయి. అలా తెలుగులో నటించిన చిత్రాలు వరుసగా విజయాలను సాధించడంతో అక్కడ స్టార్డమ్ వచ్చింది. ఆ తరువాత కోలీవుడ్‌లో కాస్త ఆలస్యంగా అవకాశాలు వచ్చినా, గార్గి చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తరువాత నటించిన కొన్ని చిత్రాలు నిరాశ పరిచినా అమరన్ చిత్రం ఘన విజయాన్ని అందించింది. మళ్లీ తమిళంలో చిన్న బ్రేక్ వచ్చింది. అందుకు కారణం తెలుగులో బిజీగా నటించడం, అదే సమయంలో బాలీవుడ్లో అవకాశాలు రావడం కారణం కావచ్చు. హిందీలో సాయి పల్లవి నటించిన ఏక్ దిన్ చిత్రం పూర్తిగా నిరాశ పరిచింది. అయితే ప్రస్తుతం నటిస్తున్న రామాయణ చిత్రంలో సీతగా ఆమె నటనపై ఆసక్తి నెలకొంది. కారణం ఆ పాత్రలో ఇంతకు ముందు పలువురు ప్రముఖ నటీమణులు నటించడమే. కాగా ఇటీవల విడుదలైన రామాయణ చిత్ర టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఇకపోతే ఇప్పుడు తమిళంలో మరో రెండు క్రేజీ చిత్రాల్లో సాయి పల్లవి కథానాయకిగా నటిస్తున్నారు. అందులో ఒకటి ధనుష్ కు జంటగా నటిస్తున్న ఓం చిత్రం కాగా, రెండోది మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి సరసన నటిస్తున్న రొమాంటిక్ లవ్ స్టోరీ చిత్రం. ఈ రెండు చిత్రాలు సాయి పల్లవి స్థాయిని మరింత పెంచేవిగా ఉంటాయని అంటున్నారు.

# ఏ సమయం కూడా ఒకేలా ఉండదు



‘‘ఏ సమయం కూడా ఒకేలా ఉండదు’’ అంటున్నారు సమంత. ఇటీవల ‘మా ఇంటి బంగారం’ సినిమాతో సూపర్ సక్సెస్ అందుకున్నారామె. ప్రస్తుతం సమంత గర్భవతి. దాంతో సినిమాలకు బ్రేక్ ఇచ్చారు. గత ఏడాది డిసెంబరు 1న దర్శక–నిర్మాత రాజ్ నిడిమోరుతో సమంత వివాహం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా ఇన్‌స్టా వేదికగా సమంత తన కొత్త ఫొటోలను షేర్ చేశారు. ‘‘ఏ సమయం కూడా ఒకేలా ఉండదు. కొన్ని సమయాలు మనల్ని ఎదురు చూడమని సూచిస్తాయి. మరికొన్ని మనల్ని పోరాటం చేయమని చెబుతాయి. ఇంకొన్ని సమయాలు కొన్నింటిని వదిలేయమని సంకేతాలు ఇస్తాయి. మనకు ఏ సమయం కావాలో ఎంచుకునే అవకాశం మన చేతుల్లో ఉండదు. అయితే ఆ సమయాల్లో మనం ఎలా జీవిస్తున్నాము అన్నదే ముఖ్యం’’ అంటూ తన కొత్త ఫొటోలకు క్యాప్షన్ జోడించారు సమంత.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S